క్లుప్తంగా

రైతుబజార్ ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 13. వంకాయ 18, బెండ 32, పచ్చిమిర్చి 40, కాకర 40, బీర 45, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 13, కారెట్ 25. దొండ 23, ఆలు 23, ఉల్లి 12, గోకర 45, దోస 21, సొర 09, పొట్ల 15, అరటి 09, చిక్కుడు 55, అర్వి 35, మునగ 23, చిలగడదుంప 40, బీట్‌రూట్ 27, కీర 19, ఫ్రెంచ్ బీన్స్ 65, కాప్సికమ్ 40.
ఈధరలు సోమవారం 9 గంటల వరకు మాత్రమే ఈధరలు అమలులో ఉంటాయి.

మహాత్మా బసవేశ్వర జయంతి ఉత్సవం



మహాత్మా బసవేశ్వర జయంతి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న

వనస్థలిపురం: మహాత్మా బసవేశ్వర 890వ జయంతి ఉత్సవాన్ని ఆదివారం వనస్థలిపురం రైతుబజారు వద్ద వీరసేవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు రైతు బజారు వద్ద ఉన్న బసవేశ్వర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న రాంమోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభచాటిన లార్డ్స్ విద్యార్థులు

బడంగ్‌పేట్: ఇబ్రహీంపట్నంలోని శ్రీనేచర్ వల్లీ రిసార్ట్‌లో ఆదివారం నిర్వహించిన ఇంటర్నేషనల్ కరాటే బెల్ట్ పరీక్షల్లో లార్డ్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. అంతర్జాతీయ గ్రాండ్ మాస్టర్, జపాన్ దేశానికి చెందిన సంకుకై చేతులమీదుగా విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాస్టర్ నరేందర్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

వనస్థలిపురం: వనస్థలిపురంలో గణేష్ దేవాలయం సమీపంలో రజనీకాంత్ గుప్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఐవీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త ప్రారంభించారు. నాయకులు చింతల రవికుమార్, విజయలక్ష్మి, జగదీశ్ కుమార్ పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- హాజరైన మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి



ఉప్పల్ : ప్రతిష్టాత్మక సర్వేలు గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఉప్పల్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో వేడుకగా నిర్వహించారు. మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ సి.రమేష్, విశ్రాంత ఐఏఎస్ అధికారి దినకరబాబు తదితరులు హాజరయ్యారు. సమాజసేవకు కార్యక్రమాల ప్రణాళికను రచించి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సమాఖ్య అధ్యక్షులు డా. బూడిద నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మల్లేశం తెలిపారు.

దివ్యాంగులను ఆదుకుంటున్న ప్రభుత్వం

- బోడుప్పల్ మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: బీఆర్ఎస్ ప్రభుత్వం దివ్యాంగులను అన్ని విధాలుగా ఆదుకుంటోందని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. బోడుప్పల్ ఎస్‌బీఆర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం కళ్యాణమస్తు, ద సేవియర్ చారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల వివాహ పరిచయ వేదికకు రాష్ట్రంలోని అన్ని జిల్లా నుంచి 400 మందికి పైగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై దివ్యాంగులను ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సరైన భాగస్వామిని ఎన్నుకుని వైవాహిక జీవితంలో స్థిరపడాలనుకునే వారు ఈ వేడుకలో పాల్గొనడం అభినందనీయం అన్నారు. దివ్యాంగులంటే దైవపుత్రులని, మిగతా వారి మాదిరిగా దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందుంటున్నారని కొనియాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. దివ్యాంగుల కోసం తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఈ పరిచయ వేదిక కోసం కమ్యూనిటీ హాల్, భోజన సౌకర్యాలు కల్పించారు. దివ్యాంగులకు సేవ చేస్తున్న అమ్మ ప్రేమ అనాథ ఆశ్రమానికి తన ఇంటిని అద్దె లేకుండా ఉచితంగా ఇస్తానని మేయర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌బీఆర్ కాలనీ అధ్యక్షుడు మల్లారెడ్డి, ఆర్గనైజర్ శ్రీదేవి, కల్యాణమస్తు గ్రూప్ ఫౌండర్ బండి బాల్‌రాజ్, సేవియర్ చారిటీ ఫౌండర్ శ్రీవల్లి, అమ్మ ప్రేమ ఫౌండేషన్ ఫౌండర్ వి.అలివేలు, దివ్యాంగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రోడ్లే డంపింగ్ యార్డులు



చెత్త డంపింగ్‌గా మారిన చంపాపేట, మీర్‌పేట మున్సిపాలిటీ సరిహద్దులోని కర్మన్‌ఘాట్ ప్రధాన కాలనీ రహదారి

చంపాపేట: పారిశుద్ధ్యం...సర్కిల్ సిబ్బందికి పాడి ఆవు.... చెత్త తరలింపు పేరుతో నిధులు దండుకోవటం... తూతూ..మంత్రంగా చెత్త శుద్ధి చేసి చేతులు దులుపుకోవటం పరిపాటిగా మారింది. దీంతో దోమలు.. ఈగలు.. పందులు స్వైరవిహారంతో పాటు ముక్కుపుటాలదిరే దుర్గంధంతో తమకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తనున్నాయో అని స్థానిక కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు.

- చంపాపేట, ఐఎస్‌సదన్ డివిజన్ సరిహద్దులోని భారత్ గార్డెన్ రహదారిపై, అదేవిధంగా మీర్‌పేట మున్సిపాలిటీ, చంపాపేట డివిజన్ సరిహద్దులోని గాయత్రీనగర్ చౌరస్తా నుంచి కర్మన్‌ఘాట్‌కు వెళ్ళే ప్రధాన రహదారిపై రోజుల తరబడి తరలించని చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి.
- చెత్త తరలింపు విషయంలో మా పరిధిలోకి రాదంటూ మీర్‌పేట మున్సిపల్, ఐఎస్‌సదన్ డివిజన్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ముక్కుపుటాలు అదిరే దుర్గంధంతో సహజీవనం చేయాల్సిన దుస్థితి ఏర్పడుతుందని చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్, దుర్గా భవానీనగర్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారుల పై శానిటేషన్ సిబ్బందికి ఉన్న చెత్త శుద్ధి కాలనీ అంతర్గత రహదాలపై లేదని విమర్శలు తలెత్తుతున్నాయి. తడి పొడి చెత్తను తప్పని సరిగా వేరుచేసి చెత్త తరలింపు వాహన సిబ్బందికి అందచేయాలని కాలనీ వాసులకు అవగాహన కల్పించటంలో సర్కిల్ సిబ్బంది వైఫల్యం చెందటం వల్లనే రహదారులు చెత్త డంపింగ్ కేంద్రాలుగా మారుతున్నాయని బాధిత కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఇప్పటికైనా సర్కిల్ సిబ్బంది చెత్త తరలింపు విషయంలో కాలనీ వాసులకు అవగాహన కల్పించటం, రహదాలపై గుట్టు చప్పుడు కాకుండా చెత్తను వేసేవారిపై నిఘా పెట్టి ఫెనాల్టీలు వేయటంతో పాటు మీర్‌పేట మున్సిపల్, ఐఎస్‌సదన్ , చంపాపేట డివిజన్ సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి కాలనీ వాసులు, రహదారి వినియోగదారులకు దుర్గంధం నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.



భారత్ గార్డెన్ రహదారిపై చెత్త కుప్పలు

మాకెందుకీ సమస్య

జీహెచ్ఎంసీకి అన్ని రకాల పన్నులను సకాలంలో చెల్లిస్తున్నాం. భారత్ గార్డెన్ ముందు రహదారిపై చెత్త డంపింగ్ కేంద్రాన్ని తలపిస్తోంది. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా మాపరిధిలోకి రాదంటూ దాట వేస్తున్నారు. సరిహద్దు లొల్లిలో మీము గిట్లనే బతకాలా. కనీసం ఆప్రాంతంలో డస్ట్ బిన్ ఏర్పాటు చేయాలి. చెత్తను డంపింగ్ చేసేవారిపై ప్రత్యేక నిఘా పెట్టి పెనాల్టీలు వేయాలి.
– ఎరవెల్లి శివకుమార్ చారి, చంపాపేట

నడకే...నరకం...

గాయత్రినగర్ చౌరస్తా నుంచి కర్మన్‌ఘాట్‌లోకి వెళ్ళాలంటే నరకాన్ని తలపిస్తుంది. ముక్కుపుటాలదిరే దుర్గంధం నడుమ ముక్కు మూసుకుని చెత్త కుప్పలు దాటుకుంటూ వెళ్ళాల్సిందే. ఆదమరిస్తే ఇక అంతే రహదారిపై పేరుకుని పెయిన చెత్తకుప్పలు క్రమం తప్పకుండా తొలగించక పోవటంతో ప్రయాణించాలంటేనే భయమేస్తుంది. సమస్యను వెంటనే పరిష్కరించాలి. శానిటేషన్ సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలి. చెత్తరహిత కాలనీలుగా తీర్చిదిద్దాలి.
– శేషుకుమార్, కర్మన్‌ఘాట్

డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిద్దుతా



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో నెలకొన్న మౌలిక సమస్యలన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో దశలవారీగా పరిష్కరించి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దటమే తన ప్రధాన లక్ష్యమని స్థానిక డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మార్నింగ్ వాకింగ్‌లో భాగంగా డివిజన్ పరిధిలోని క్రాంతినగర్, శుభోదయ కాలనీలలో సర్కిల్, జలమండలి అధికారులతో కలసి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. సర్కిల్, జలమండలి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- మేయర్ చిగురింత పారిజాత
- శ్రీవిద్య టౌన్‌షిప్ కాలనీలో సీసీ కెమెరాల ప్రారంభం

బడంగ్‌పేట్: నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపునకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదం చేస్తాయని మేయర్ చిగురింత పారిజాత అన్నారు. 31వ డివిజన్‌లోని శ్రీవిద్య టౌన్‌షిప్ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతీ కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇంటింటికీ నిఘా నేత్రాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలను కట్టడి చేయొచ్చని తెలిపారు. కాలనీల్లో బిగించిన కెమెరాలను సంబంధిత పోలీస్ స్టేషన్లకు అనుసంధానం చేస్తే బాగుంటుందన్నారు. అనంతరం డివిజన్‌లోని గ్రీన్‌రిచ్ కాలనీలో పర్యటించి, ప్రజలతో మాట్లాడారు. స్థానిక సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, బాలునాయక్, మున్సిపల్ కార్పొరేషన్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, సహకార బ్యాంక్ వైస్ చైర్మన్ కొలన్ తిరుపతి రెడ్డి, నాయకులు ఎర్ర జైహింద్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, నారాయణగౌడ్, రవిందర్‌రెడ్డి, మనోహర్, శ్రీనివాస్, రాముగౌడ్, రాజేందర్‌రెడ్డి, యాదయ్య, నరహరిగౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.



మేయర్ పారిజాతను సన్మానిస్తున్న కాలనీవాసులు

విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలి



విద్యా సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న లెక్కల కృష్ణారెడ్డి

చంపాపేట: విద్యార్థులకు పాఠ్యాంశాలపై ప్రశ్నించే తత్వాన్ని పెంపొందిచటంతో పాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని విద్యావేత్త, విశ్రాంత ఉపాధ్యాయుడు లెక్కల కృష్ణారెడ్డి ఆన్నారు. ఆదివారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీ సరస్వతీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠశాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. చిన్నారులను సెల్‌ఫోన్ కల్చర్ నుంచి దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని గుర్తు చేశారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ లలితారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ చెక్‌ను అందచేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు.బీఎన్‌రెడ్డి డివిజన్ సాహెబ్‌నగర్‌లోని వీరాంజినేయ కాలనీకి చెందిన నికిత గత కొంతకాలంగా మోకాళ్ళ నొప్పులతో బాధపడుతుండగా ఆమె బంధువులు ఆ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్‌కై దరఖాస్తు చేయించారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2.50 లక్షలు మంజూరు కావటంతో ఆదివారం బీఎన్‌రెడ్డిలో జరిగిన ఓ సమావేశంలో ఎల్ఓసీ చెక్‌ను అందచేశారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

ఎల్బీనగర్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు.ఆదివారం బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని సాగర్ కాంప్లెక్స్‌లో డివిజన్ అధ్యక్షులు మకుటం సదాశివుడు ఆధ్వర్యంలో హాత్‌సే హాత్ జోడో యాత్ర నిర్వహించారు. మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ మారనని చెప్పిన ఎమ్మెల్యే తన అభివృద్ధి తప్ప నియోజకవర్గాన్ని పట్టించకోవడం లేదన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో పార్కులు, రోడ్లు కబ్జా అవుతుంటే కార్పొరేటర్, ఎమ్మెల్యే చోద్యం చూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో గణేష్‌రెడ్డి, రాజశేఖర్, రమేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీని గద్దె దింపాలి



నర్సింగ్ కుటుంబాన్ని పరమర్శిస్తున్న సామ రంగారెడ్డి

లింగోజిగూడ: ప్రజా సమస్యలు పరిష్కరించని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదింపి బీజేపీకి అవకాశం ఇవ్వాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి పిలుపునిచ్చారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని అధికారినగర్ సమస్యలు పరిష్కరించాలని ఇటీవల చింతలకుంటలో టవర్ ఎక్కి నిరసన తెలిపిన నర్సింగ్‌రావును ఆదివారం అధికారినగర్‌లోని తన ఇంట్లో పరమర్శించారు.అనంతరం కాలనీ వాసులతో కలసి కాలనీలో పర్యటించారు.కాలనీలో సమస్యలు పరిష్కరించాలని ఎన్ని సార్లు మొర పెట్టుకున్న పట్టించుకునే వాడే లేడని అన్నారు.

మౌలికవసతులు ఏర్పాటు చేస్తా

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు తన శాయ శక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని కృష్ణానగర్‌కాలనీలో కాలనీ ప్రతినిధులతో కలిసి ఆదివారం కార్పొరేటర్ సుజాతనాయక్ పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, శశి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'నాదర్‌గుల్ కింగ్స్'

బడంగ్‌పేట్: నాదర్‌గుల్‌లో నిర్వహించిన ప్రీమియర్ సీజన్– 5 క్రికెట్ టోర్నమెంట్‌లో నాదర్‌గుల్ కింగ్స్ ఎలెవెన్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నాదర్‌గుల్ సూపర్ కింగ్స్ టీమ్‌తో తలపడింది. విజేత జట్టుకు రూ.55.555, ట్రోఫీ, రన్నరప్‌గా నిలిచిన టీమ్‌కు రూ.33,333 ప్రైజ్ మనీతో పాటు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో ముద్దం వెంకట్‌రెడ్డి, సుధాకర్‌యాదవ్, జైపాల్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, గ్రామ పెద్దలు 8 టీంల ఫ్రాంచైజీలు, సభ్యులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

బడంగ్‌పేట్: మాజీ హోమంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి వర్ధంతిని శనివారం రాత్రి బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రె కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం బడంగ్‌పేట కార్పొరేషన్‌లో పనిచేస్తున్న 50మంది పారిశుద్ధ్య సిబ్బందికి చీరలు, పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేషన్ యువజన విభాగం అధ్యక్షుడు చిత్రం సాయి, నర్సింగ్ తదితరులున్నారు.


క్రికెట్ కిట్ల పంపిణీ



జైపురికాలనీ యువతకు క్రికెట్ కిట్లను అందజేస్తున్న చింతల సురేంద్రనాథ్ యాదవ్

నాగోలు: క్రీడలు మనిషి ఆరోగ్యంగా, మానసికంగా ఎదగడానికి ఉపయోగపడతాయని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి చింతల సురేంద్రనాథ్ యాదవ్ అన్నారు. ఆదివారం జైపురి కాలనీ యువతకు క్రికెట్ కిట్లను అందజేశారు. యువత సమయం వృథా చేయకుండా క్రీడాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ యువత పాల్గొన్నారు.

రూ. 8 లక్షల విలువైన సెల్‌ఫోన్లు అందజేత



బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఏసీపీ శ్యామ్‌సుందర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

మలక్‌పేట: మలక్‌పేట పీఎస్ పరిధిలో ఆయా వ్యక్తుల నుంచి మాయమైన 50 సెల్‌ఫోన్లు క్రైమ్ సిబ్బంది సేకరించారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మలక్‌పేట ఏసీపీ శ్యామ్‌సుందర్ సెల్‌ఫోన్లు అందజేశారు. వివిధ కంపెనీలకు చెందిన రూ.8 లక్షల విలువైన సెల్‌ఫోన్లు అందజేసినట్లు తెలిపారు.

మంత్రి చొరవతోనే అభివృద్ధి

పహాడీషరీఫ్: విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి చొరవతో నియోజకవర్గంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ఉపాధ్యక్షుడు నిమ్మల నరేందర్‌గౌడ్ అన్నారు. రంగనాయకుల కాలనీలో రూ.18 లక్షలతో నూతనంగా నిర్మించిన మరాఠి భవన్ బుద్ధ విహార్‌లో 12వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు ఇరగొట్టి కృష్ణ సొంతంగా సమకూర్చిన మైక్‌సెట్‌ను నిమ్మల నరేందర్‌గౌడ్ నిర్వాహకులకు ఆదివారం అందజేశారు. సీసీ కెమెరాలు తన సొంతంగా ఏర్పాటు చేయిస్తానని ఈ సందర్భంగా నరేందర్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు గండికోట రాము తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలు ఉపయోగించుకోవాలి



శిబిరంలో పాల్గొన్న పీసీసీ ప్రధాన కార్యదర్శి వల్లే నారాయణరెడ్డి, పెండ్యాల నగేష్

దిల్‌సుఖ్‌నగర్: ఉచిత మెడికల్ క్యాంపు సద్వినియోగం చేసుకోవాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి వల్లే నారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం చిత్రలేఅవుట్ లోని కాచిగూడ ప్రతిమ హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపు ని నారాయణ రెడ్డి, చిత్రలేవట్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్‌లు ముఖ్యఅతిథిలుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతిమ హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

- బీఆర్ఎస్ అక్రమాలకు అడ్డుకట్ట వేస్తాం
- కార్పొరేటర్ శ్రీవాణి
- చేవెళ్ల సభకు తరలిన కమలం నేతలు



హుడాకాంప్లెక్స్: అమిత్‌షా సభకు తరవెళ్తున్న కార్పొరేటర్ శ్రీవాణి, బీజేపీ నాయకులు

హుడాకాంప్లెక్స్: చేవెళ్లలో ఆదివారం నిర్వహించిన విజయ సంకల్ప సభకు సరూర్‌నగర్ డివిజన్ బీజేపీ నేతలు భారీగా తరలివెళ్లారు. కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తంచేశారు. కేసీఆర్ పాలనలో అన్నివర్గాల ప్రజలు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే బీజేపీ ప్రధాన లక్ష్యమని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వీరి అవినీతిని బయటకు లాగుతామని స్పష్టంచేశారు. సభకు తరలిన వారిలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బేగరబోయిన సురేష్ కుమార్, నాయకులు ఆకుల అంజన్‌కుమార్, ఘంటి కిరణ్‌కుమార్, నర్సింహారెడ్డి, తదితరులు ఉన్నారు.

సభకు తరలిన బీజేపీ శ్రేణులు

తుక్కుగూడ: చేవెళ్ల పట్టణంలో ఆదివారం నిర్వహించిన బీజేపీ బహిరంగ సభకు తుక్కుగూడ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. వీరిలో ఆపార్టీ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు ఉన్నారు.